janodaya
# జనోదయ
RNI No - APTEL/2022/81596
కరీంనగర్ ఆదివారం 31.05.2026 సంపుటి : 03 సంచిక : 172 పేజీలు : 08 వెల : రూ.5
Karimnagar Sunday 31.05.2026 Volume: 03 Issue 172 Pages 08 Cost 5/
తెలుగు దినపత్రిక

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190


మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

# ఆఖరి పోరుకు సై

## రెండోసారి చిక్కేదెవరికి?

### నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ మ్యాచ్

5లో..




ROYAL CHALLENGERS BANGALORE VS GUUARAT TITANS

కళ్లు చెదిరే మెరుపు ఇన్నింగ్స్‌లు.. ఔరా అనిపించిన అద్భుత ఫీల్డింగ్ విన్యాసాలు.. కట్టిపడేసిన బౌలర్ల మాయాజాలానికి నేటి (ఆదివారం)తో తెర పడనుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-19వ సీజన్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగ నుంది. ఇందుకు ప్రపంచం లోనే అతిపెద్ద నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఇరు జట్లు నాలుగోసారి తలపడబోతున్నాయి.

**తుది జట్లు**

బెంగళూరు: వెంకటేశ్ అయ్యర్, విరాట్, దేవ్‌దత్, రజత్ (కెప్టెన్), క్రునాల్, జితేశ్, డేవిడ్, భువనేశ్వర్, హాజెల్‌వుడ్, డఫీ, రసిఖ్.

గుజరాత్: గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, కుమార్ కుషాగ్ర, సుందర్, నిశాంత్, హోల్డర్, రషీద్, సిరాజ్, రబాడ, ప్రసిద్ధ్.

# బాల్క సుమన్ అరెస్టు

ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయాలంటూ చేసిన వ్యాఖ్యల కేసులో అదుపులోకి

14 రోజుల రిమాండ్‌కు జడ్జి ఆదేశం



**హైదరాబాద్, మే 30:** బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ బాల్కసుమన్ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై నాంపల్లిలోని సింగరేణి భవన్ ఎస్ అండ్ పీసీ విభాగం జూనియర్ ఇన్‌స్పెక్టర్ బి.ఆనంద్ నాంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన నాంపల్లి పోలీసులు.. బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్ వద్ద బాల్క సుమన్‌ను శనివారం అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా నాంపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సుమన్ అరెస్టు వార్త తెలుసుకొని బీఆర్ఎస్ కార్యకర్తలు, సుమన్ అనుచరులు పెద్ద సంఖ్యలో నాంపల్లి పోలీస్టేషన్ వద్దకు చేరుకున్నారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు స్టేషన్ చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇతరులు పోలీసుస్టేషన్‌లోకి రాకుండా ప్రధాన ద్వారానికి తాళం కూడా వేశారు. పోలీసుస్టేషన్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు, బాల్క సుమన్ అనుచరులను పోలీసులు అక్కడ నుంచి చెదరగొట్టారు. అనంతరం శనివారం రాత్రి సమయంలో బాల్క సుమన్‌ను హిమాయత్‌నగర్‌లోని న్యాయమూర్తి ఇంటి వద్దకు నాంపల్లి పోలీసులు తీసుకెళ్లారు. అయితే, ఎలాంటి అనుమతి లేకుండా బాల్క సుమన్‌ను తమ అపార్ట్‌మెంట్‌లోకి తీసుకొచ్చిన పోలీసులపై న్యాయమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను అనుమతించే వరకు బయట వేచి చూడాలని ఆదేశించారు. దీంతో కొద్దిసేపు గందరగోళం ఏర్పడింది, బాల్క సుమన్ అభిమానులు, న్యాయవాదులు న్యాయమూర్తి ఆదేశాల కోసం రాత్రి 11.20 గంటల వరకు బయటే వేచి ఉన్నారు. కాగా సుమన్‌ను 14 రోజుల రిమాండ్‌కు తరలించాలని అర్ధరాత్రి తర్వాత జడ్జి ఆదేశించారు.

# పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

తొలి విడతగా లక్ష, మలి విడతలో మరో లక్ష.

ఏడాదిలోగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన



వివరాలు 2లో

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసం బంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చా రు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగేలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవ ఎన్నిక



కర్ణాటక కొత్త ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పగ్గాలు చేపట్టడానికి మార్గం సుగమమైంది. శనివారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో కర్ణాటక అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్లో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ పేరును సిద్ధరామయ్య ప్రతిపాదించారు. ఎమ్మెల్యేలు సమర్థించడంతో ఏకగ్రీవంగా డీకే ఎన్నిక జరిగింది. పార్టీ కేంద్ర పరిశీలకుల సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. సీఎల్పీ నేతగా డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పార్టీ కర్ణాటక వ్యవహారాల ఇన్‌చార్జి రణ్‌దీప్ సూర్జేవాలా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు.దీనికి ముందు సీఎల్పీ సమావేశానికి డీకే బయలుదేరి నప్పుడు.. ఆయన అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. ముఖ్యమంత్రిగా ఈనెల 3న ప్రమాణస్వీకారం చేయనున్నారా అని మీడియా అడిగినప్పుడు 'థర్డ్ థర్డ్' అంటూ డీకే సమాధానమిచ్చారు. అనంతరం సీఎల్పీ సమావేశం కోసం విధాన సౌధకు చేరుకున్నారు. విధాన సౌధ మెట్లకు నమస్కారం చేసిన అనంతరం లోపలకు అడుగుపెట్టారు.

# ఆపరేషన్ సింధూర్ 2.0కు సైనిక దళాలు సిద్ధం

**ఆర్మీ చీఫ్**



**న్యూఢిల్లీ:** ఒకవేళ అవసరమైతే ఆపరేషన్ సింధూర్ 2.0 చేపట్టేందుకు సైనిక బలగాలు సిద్ధంగా ఉన్నట్లు ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. ఆధునిక యుద్ధ రీతుల్లో ఆరితేరేందుకు త్రివిధ దళాలు సన్నద్ధం అవుతున్నాయని ఆయన అన్నారు. భూమి, ఆకాశం, సముద్రంలో అత్యాధునిక రీతిలో సైనిక సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. పుణెలో జరిగిన నేషనల్ డిఫెన్స్ అకాడమీ పాసింగ్ ఔట్ పరేడ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఉద్రిక్తల పరిస్థితులు తాత్కాలికంగా అదుపులో ఉన్నా.. కానీ రాబోయే దశకు చెందిన యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు త్రివిధ దళాలు భీకరంగా రెడీ అవుతున్నట్లు ఆయన చెప్పారు. భవిష్యత్తులో జరగబోయే యుద్ధాలు కేవలం సంప్రదాయ రీతికే పరిమితం కావు అని, సైబర్.. ఎలక్ట్రోమ్యాగ్నటిక్, కాగ్నిటివ్ డోమెయిన్లలోనూ యుద్ధ ప్రభావం ఉంటుందని ఆర్మీ చీఫ్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత్ తన సత్తా చాటిందన్నారు. సైనిక దళాలు చాలా కచ్చితత్వంతో అటాక్ చేయగలవని నిరూపించామన్నారు. యుద్ధ క్షేత్రంలో జరుగుతున్న మార్పుల పట్ల ఆర్మీ జాగృతతో ఉందని, భవిష్యత్తుకు తగ్గట్లుగా అన్ని దళాలు ఆధునిక విధానంలో సమాయత్తం అవుతున్నాయని అన్నారు. మార్పుల్లో భాగంగా దివ్యాస్త్ర బ్యాటరీలు, శక్తిమాన్ రెజిమెంట్స్, భారత్ బెటాలియన్స్‌తో పాటు ఇతర టెక్నాలజీ ఆధారిత సైన్యాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అన్ని అకాడమీల్లో డ్రోన్ల వినియోగంపై శిక్షణ జరుగుతోందన్నారు. ఎన్డీఏ శిక్షణా కేంద్రంలో భారీ డ్రోన్లు, సిములేటర్లతో ఎన్డీఏ క్యాడెట్లకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంలోనూ ముందంజలో ఉన్నట్లు జనరల్ ద్వివేది తెలిపారు. ఓఓడీఏ.. అబ్జర్వ్, ఓరియంట్, డిసైడ్, యాక్ట్ చక్రాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఏఐ ఆధారిత సేవల వినియోగాన్ని పెంచుతున్నట్లు చెప్పారు.

# అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాలి

### ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి

జనోదయ : గంగాధర

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 ప్రకారం అంటరానితనాన్ని పూర్తిగా నిషేధించి, నిర్మూలించాలని ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి తెలిపారు.నర్సింహులపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం గ్రామ సర్పంచ్ రాచమళ్ల రవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఐ రజనీకాంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పౌర హక్కుల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో ప్రతి పౌరుడు సమాన హక్కులు కలిగి ఉన్నారని, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావాలతో అందరూ కలిసి మెలిసి జీవించాలని సూచించారు. పౌరులందరూ చట్టాల పట్ల అవగాహన పెంపొందించుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.హోటళ్లలో రెండు గ్లాసుల విధానం అమలు చేయడం, దే



వాలయ ప్రవేశం వంటి విషయాల్లో ఎవరిపైనా వివక్ష చూపరాదని, అలాంటి చర్యలు చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. వివక్షకు పాల్పడిన వారు చట్టపరమైన చర్యలు, శిక్షలకు గురవుతారని తెలిపారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి, మండల అంబేద్కర్ సంఘాల ప్రతినిధులు ప్రవీణ్, శ్రీనివాస్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లి జోన్‌లో అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

### నిర్వహించిన జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్




జనోదయ : శేరిలింగంపల్లి

శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ ఈరోజు జోన్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. వివిధ సర్కిళ్లు, వార్డుల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఈ సమావేశంలో క్షుణ్ణంగా అంచనా వేశారు. రోడ్ల అభివృద్ధి పనులు కొత్త రోడ్ల నిర్మాణం, పాత రోడ్ల మరమ్మతులు, బీటీ రోడ్ల పునరుద్ధరణ పనుల ప్రస్తుత స్థితి వర్షపు నీటి కాలువల ప్రాజెక్టులు స్టార్మ్ వాటర్ డ్రైన్ పనులు, వరద నివారణ చర్యల అమలు తీరు పార్కుల అభివృద్ధి ,పార్కుల సుందరీకరణ, కొత్త పార్కుల ఏర్పాటు, ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్‌ల పనుల పురోగతి పౌర మౌలిక సదుపాయాలు కమ్యూనిటీ హాళ్లు, పబ్లిక్ టాయిలెట్లు, స్ట్రీట్ లైట్లు తదితర పనుల వివరాలు ఇతర ప్రజా ఉపయోగ పనులు జోన్ పరిధిలో చేపట్టిన వివిధ ప్రజోపయోగ ప్రాజెక్టుల స్థితిగతులు ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ నారాయన్ అమిత్ ఐఏఎస్ మాట్లాడుతూ, అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పనులు వేగవంతం చేయాలని, ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో జోన్ సూపరింటెండింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

### కొనుగోలు సమస్యతో రైతులు ఎవ్వరూ చనిపోలేదు

### మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య

జనోదయ : వర్ధన్నపేట

మొక్కజొన్న కు మద్దతు ధర కల్పించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనని, రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య తెలిపారు. శనివారం వర్ధన్నపేట మండల కేంద్రంలో ఉన్న క్యాంపు కార్యాల యంలో ఆయన మాట్లాడుతూ..ధాన్యానికి కనీస మద్దతు ధర ఏం ఎస్ పి అమలును కేంద్రం పట్టించుకోలేదని, రైతులు నష్ట పోకుండా రాష్ట్రమే మద్దతు ధరకు కొనుగోలు చేసింది అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 52 లక్షల టన్నులకే అనుమతి ఇచ్చింది కానీ రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 24 లక్షల టన్నులు కొనుగోలు చేసిందనీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన స్థాయిలో గడిచిన పదేళ్లలో ఎప్పుడూ బి ఆర్ ఎస్ ధాన్యం కొనుగోలు చేయలేదు. తాలు పేరిట, మట్టి రాళ్ళ పేరిట,మ్యాచర్ పేరిట కొరివిలు పెట్టి మిల్లరులతో కుమ్మక్కై రైతులను హరి



గోస పెట్టేదనీ, రైతులకు ధాన్యం డబ్బులు బ్యాంకు లో పడాలంటే కనీసం 6-7 నెలలు పట్టేది అని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ప్రభుత్వం లో ధాన్యం కొనుగోలు పూర్తయ్యాక 72 గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలో డబ్బులు జమవుతున్నాయి అని తెలిపారు. బి ఆర్ ఎస్ వారు కేంద్రాన్ని ప్రశ్నించాలి.. రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకోవడం, ప్రజలను తప్పు దారి పట్టించే ప్రయత్నమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బి, బిజెపి వాళ్ళు అసత్యపు ప్రచారాలు మాని రైతులకు మేలు చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కార్యక్రమంలో ఐనవోలు టెంపుల్ డైరెక్టర్ భీమా నాయక్, వర్ధన్నపేట మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్ సిరిపెల్లి వాణి కుమార్ లు పాల్గొన్నారు.

# పట్టణ పేదలకు ఇందిరమ్మ ఇళ్లు

### తొలి విడతగా లక్ష, మలి విడతలో మరో లక్ష

### ఏడాదిలోగా లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన

జనోదయ : హైదరాబాద్

పట్టణ పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా వారు నివసించే ప్రాంతాల పరిధిలోనే అధునాతనమైన ఇందిరమ్మ ఇళ్లను కట్టి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. త్వరలో క్యూర్ పరిధిలో తొలివిడతగా మంజూరు చేసిన లక్ష ఇళ్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడమేగాక ఏడాది తిరిగేలోగా వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.శనివారం బంజారాహిల్స్‌లో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజా



రుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం వలే ప్రజలు ఒకచోట ఇళ్లు 30-40 కిలోమీటర్ల అవతల ఉండేలా చేయబోమని , ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్ గా తీసుకొని ఏ నియోజకవర్గ ప్రజలకు ఆ నియోజకవర్గంలోనే ఇళ్లు నిర్మిస్తామని ఇది పేదలకు పెద్దన్న , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుకగా అందిస్తామని అన్నారు.పేదవాని గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలు. .రాష్ట్రంలో పేదవాని గుమ్మం వద్దకే ప్రజా ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నామన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే తదితర శాఖలు ఒకే చోట అందుబాటులోకి తెచ్చేలా ఈ సమీకృత భవనాల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. తమ ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలలో భాగంగా మూడు కార్పొరేషన్ల పరిధిలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటు రంగానికి దీటుగా కార్పొరేట్ తరహాలో అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. అంతేగాక ప్రభుత్వానిపై ఈ నిధుల భారం పడకుండా రియల్ ఎస్టేట్ నిర్మాణరంగంలో ప్రసిద్ధమైన సంస్థలకు నిర్మించే బాధ్యత అప్పగిస్తున్నామన్నారు. మరి కొద్ది నెలల్లో ఇక్కడ ఫినిక్స్ సంస్థ 30 వేల చదరపు అడుగుల్లో ఈ భవనాన్ని పూర్తి చేసి ఇస్తుందని వెల్లడించారు. బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు , డిఐజి కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ – గోల్కొండ కార్యాలయాలు వస్తాయని వీటివలన ఈ ప్రాంత ప్రజలకు మరిన్ని ఉద్యోగ, వ్యాపార సౌకర్యాలు కలుగుతాయన్నారు. వందలాది సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో నమాజ్‌చేసుకుంటున్న ముస్లిం సోదరులకు ఏటా రెండు సార్లు నమాజు కార్యక్రమం నిర్వహించుకునేలా అధికారులను ఆదేశించామని ప్రకటించారు.కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా ఎంపీ సునీల్ యాదవ్,ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ,ఎమ్మెల్యే నవీన్ యాదవ్,స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190
వాస్తవం

# రిటైర్డ్ పోలీసుల సేవలు ఆదర్శప్రాయం

## సైబరాబాద్ సీపీ

**జనోదయ : శేరిలింగంపల్లి**

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన 12 మంది పోలీసు సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ, రిటైర్ అయి న సిబ్బందికి పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తూ, ఈ రోజు పదవీ విరమణ పొందుతున్న పోలీసు సిబ్బందిలో అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) ఎం. ఫజ్లుర్ రెహమాన్, షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ జి. రామ్‌చందర్, చందానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఎం. నరసింహారెడ్డి, జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కమల్ గౌరీ సయ్యద్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎం.డి. సర్దార్ బేగ్, మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎం. నారాయణ, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్ఐలు ఎ



స్. నాగభూషణం, బి. రమేష్, ఎం. సుధాకర్ రెడ్డి, పి. లక్ష్మయ్య, బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి. హుస్సేన్ పీరా మరియు శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ జనార్ధన్ ఉన్నారు. వీరు తమ సుదీర్ఘ సేవా కాలంలో పోలీసు శాఖకు విశేష సేవలందించి ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సేవా భావానికి మాత్రం ముగింపు కాదని అన్నారు. పోలీస్ శాఖ అభివృద్ధికి, ప్రజల భద్రతకు తమ వంతు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలియజేశారు. క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో తన విధులను నిర్వర్తించి శాఖకు మంచి పేరు తీసుకువచ్చిన రిటైర్డ్ పోలీసు సిబ్బంది సేవలు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పోలీస్ ఉద్యోగం అనేది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా సమాజానికి సేవ చేసే గొప్ప బాధ్యత అని, ఆ బాధ్యతను విజయవంతంగా నిర్వర్తించడంలో కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని తెలిపారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అలాగే తమ సుదీర్ఘ అనుభవాన్ని, విలువైన పరిజ్ఞానాన్ని యువ పోలీసు సిబ్బందితో పంచుకుంటూ, వారి వృత్తి నైపుణ్యాల పెంపొందనకు తోడ్పడాలని, పోలీసు శాఖకు అవసరమైన సందర్భాల్లో భవిష్యత్తులో కూడా తమ సహకారం అందించాలని కోరారు. రిటైర్డ్ సిబ్బందికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, క్రైమ్స్ డీసీపీ ముత్యం రెడ్డి, విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కర్ణం, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ సంజీవ్, సీఏఓ వెంకట్ రెడ్డి, పోలీస్ సహకార సంఘం ఇన్‌చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# కాలువల్లో పూడిక తొలగించి వరద ముంపు నివారించడానికి చర్యలు

## రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**జనోదయ : గోదావరిఖని**

కాలువల్లో యుద్ద ప్రాతిపదికన పూడిక తొలగించి వరద ముప్పు నివారించడానికి చర్యలు తీసుకుంటున్నామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా శనివారం ఒకటవ డివిజన్ లో డిప్యూటీ మేయర్ పాత పెల్లి ఎల్లయ్య , అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ జె. అరుణ శ్రీ తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సంధర్భంగా స్థానిక నాయకులు మడిపెల్లి మల్లేష్ వారికి స్వాగతం పలికి కాలనీ సమస్యలను ప్రత్యక్షంగా చూయించారు. మేయర్ ఆదేశాలతో జె సి బి , బ్లేడ్ ట్రాక్టర్ , చైన్ జె సిబి , బాబ్ కార్ట్ , జెట్టిశీగ్ యంత్రం , పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో పి కె. రామయ్య కాలనీ పట్టణ ప్రకృతి వనం ప్రక్కన ఉన్న వీధుల్లో పూడుక పోయి ఉన్న ఉపరి తల కాలువను పూర్తిగా శుభ్రం చేయించారు. తుప్పలు , పొదలు , పిచ్చి చెట్లు పెరిగి చెట్ల కొమ్ములు రోడ్డు మీదకు వచ్చి నడవడానికి కూడా వీల్లేకుండా ఉన్న వీధుల్లో బ్లేడ్ యంత్రం సహాయంతో వాటిని తొలగించారు . దీంతో దారులు విశాలంగా మారాయి . పట్టణ ప్రకృతి వనంలో పెరిగిన పిచ్చి చెట్లను కూడా తొలగించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భూగర్భ జలాలు పెరగడానికి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ఎక్కువ సంఖ్యలో నిర్మించవలసియున్న దృష్ట్యా ఈ




స్థలంలో ఇంకుడు గుంతల ఏర్పాటుకు గుంతలు తీసి సిద్దం చేశారు. కార్యక్రమం అనంతరం మేయర్ మాట్లాడుతూ కాలనీ ఏర్పడిన నాటి నుండి కూడా కాలువల్లో పూడిక తీసిన ఆనవాళ్ళు లేవని అన్నారు. ఎం ఎల్ ఎ ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో పూడిక తొలగించడానికి అవసరమైన పక్షంలో ఒకటవ డివిజన్ లోనే మరికొన్ని రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ చేపడతామని అన్నారు. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పి కె రామయ్య కాలనీలో ఎశీ . ఎల్ ఎ చొరవతో రహదారులు విశాలంగా నిర్మించడం జరిగిందని అన్నారు. యు జి డి ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మిగిలి పోయిన యు జి డి , రోడ్లను కూడా డి ఎం ఎఫ్ టి , ఎన్ టి పి సి సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. స్పెషల్ డ్రైవ్ లో మునిసిపల్ సిబ్బంది చాలా బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలువల్లో నిలిచిపోయిన పూడిక తొలగింపు ఇప్పుడు జరుగుతున్నదని అన్నారు. ఎం ఎల్ ఎ కృషి తో అభివృద్ధి చురుగ్గా జరుగుతున్నదని అన్నారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఋతుపవన కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వర్షాకాలం రాకముందే కాలువల్లో పూడిక తొలగించే పనులను ప్రారంభించడం జరిగిందని అన్నారు. వరద ప్రభావం ఉండే ముర్గునీటి కాలువలలో పూడిక తొలగింపు పనులు చురుగ్గా సాగుతున్నాయని అన్నారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి పెట్టి మరింత మెరుగుపరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వెంగళ బాపు , నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర , డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , ఎ ఇ తేజస్విని , సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్ , సీనియర్ అకౌంటెంట్ రాజ్ కుమార్ , జవాన్ సూర్య , నగర పాలక సంస్థ సిబ్బంది , మెప్మా ఆర్ పి లు పాల్గొన్నారు.

# సింగరేణిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలను నిర్వహించాలి

## ఆర్జీ-1 జీఎం డి.లలిత్ కుమార్

**జనోదయ : గోదావరిఖని**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జూన్ 2 న జీఎం కాలనీలోని గోదావరికళా ప్రాంగణంలో కనుల పండువగా, అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆర్జీ-1 జీఎం డి. లలిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ విభాగాల అధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, జూన్ 2న నిర్వహించబోయే కార్యక్రమాల షెడ్యూల్‌ను అధికారులకు అప్పగించిన బాధ్యతలను వివరించారు. ఈ సంద



ర్భంగా జూన్ 2 సాయంత్రం గోదావరికళా ప్రాంగణ వేదికపై ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, తెలంగాణ వైభవాన్ని చాటే ప్రదర్శనలు ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, ఈ కార్యక్రమంలో సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, యూనియన్ ప్రతినిధులు, అధికారులు మరియు పురజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్.ఓ. టు జీఎం చంద్రశేఖర్, ఎసియంఓ డాక్టర్ అంబిక, ఏజెంట్లు చిలుక శ్రీనివాస్, ఎల్. రమేష్, ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఏజీఎంలు అంజనేయులు, రాం మోహన్ రావు, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సాయి ప్రసాద్, డీజీఎంలు వరప్రసాద్, జితేందర్ సింగ్, ధనలక్ష్మి భాయ్, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, అధికారులు సురేష్, రాజేష్, , బ్రహ్మాజీ రావు, హనుమంతరావు, వీరారెడ్డి తో పాటు ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగడమే ప్రభుత్వ లక్ష్యం

## మహిళా శక్తి వారోత్సవాలలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

జనోదయ : పరకాల



రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు.శనివారం గీసుగోండ మండలంలోని గ్రామాలలో మహిళా శక్తి వారోత్సవాలలో భాగంగా నిర్మించనున్న మహిళా సమైక్య భవనంలకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని,కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల వ్యవస్థ ప్రారంభమైనదని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ద్వారా సాధ్యమవుతుందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, పెట్రోల్ బంకులు,సోలార్ విద్యుత్ ఉత్పత్తి, రైస్ మిల్లులు, మహిళా శక్తి సూపర్ బజార్లు, వి హబ్ సెంటర్ ,మహిళా ఉత్పత్తుల మార్కెటింగ్కు అనుగుణంగా ఆధునిక వసతులతో గ్రామ మహిళా భవనాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.పరకాల మహిళా డైరీ ఏర్పాటు మహిళలపై పూర్తి నమ్మకంతో ఏర్పాటు చేస్తున్నామని, ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలని కోరారు.రేవంత్ అన్న నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో శంకుస్థాపనలు మేమే చేస్తాం, ప్రారంభోత్సవాలు మేమే చేస్తాం అని అన్నారు.బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రం అప్పులపాలు..గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి తోడ్పడే మహిళా సమైక్య భవనాలు ఉపయోగపడతాయన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# నేటి నుండి ఏనుమాముల మార్కెట్‌కు సెలవులు




## వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ

జనోదయ : వరంగల్

రోహిణి కార్తీ ఎండల తీవ్రతతో రాష్ట్రంలో విపరీతముగా పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఉష్ణోగ్రతని తట్టుకునేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరినందున మార్కెట్ కార్మిక సంఘాలు, ఛాంబర్ అన్ని సెక్షన్ల విజ్ఞప్తి మేరకు ఆదివారం నుండి జూన్ 7వ తారీకు ఆదివారం వరకు వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వారు లేఖ ద్వారా మార్కెట్ బందు కోరినారు.పై సందర్భములను పురస్కరించుకొని సోమవారం నుండి ఆదివారం వరకు వరసగా (7)రోజులు మార్కెట్ బందు ఉంటుందని వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తెలిపినారు. తిరిగి జూన్ 08 సోమవారం మార్కెట్ పునఃప్రారంభమగును. రైతు సోదరులు గమనించి తమ వ్యవసాయ ఉత్పత్తులను బందు రోజులలో మార్కెట్ కు తరలించి ఇబ్బందులకు గురి కావద్దని తెలియజేసినారు. రైతు సోదరులు మార్కెట్ కమిటితో సహకరించగలరని కోరినారు.

# పోలీస్ అధికారులు నిజాయితీగా పని చేయాలి

## తెలంగాణ డిజిపి సి.వి. ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీపీ సన్ ప్రీత్ సింగ్

జనోదయ : వరంగల్ క్రైమ్




ప్రతి పోలీస్ అధికారి నీతి నిజాయితీగా పనిచేయాలని తెలంగాణ డిజిపి సివి ఆనంద్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర డిజిపిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిజిపి రాష్ట్ర పోలీస్ అధికారులతో శనివారం హైదరాబాద్ నుండి వీడియో సమావేశం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ.. శాంతి భద్రతల పరిరక్షణ కొరకు పోలీస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులతో, ఉద్యోగ సమయంలో అధికారులు, సిబ్బంది పాటించాల్సిన తీరుపై డిజిపి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.సమావేశానికి వరంగల్ కమిషనరేట్ కు చెందిన డీసీపీ లు, అదనపు, ఏసీపీ, ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ వారి, వారి కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# ఎస్ఐగా పదోన్నతి పొందిన ఏఎస్ఐ మల్లేశంకి సత్కారం

## గంగాధర ఎస్ఐ వంశీకృష్ణ



జనోదయ : గంగాధర

గంగాధర పోలీస్ స్టేషన్‌లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మొగిలి మల్లేశంకి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి లభించడంతో పాటు సిరిసిల్లకు బదిలీ అ య్యారు. ఈ సందర్భంగా గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా సత్కార కార్యక్రమంని ర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మొగిలి మల్లేశం సేవలను కొనియాడుతూ, ఆయన క్రమశిక్షణ, విధి నిర్వహణలో చూపిన నిబద్ధతను ప్రశంసించారు. పదోన్నతి పొందిన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, సిరిసిల్లలో కొత్త బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. మొగిలి మల్లేశం గారు మాట్లాడుతూ, తన సేవా కాలంలో సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. గంగాధర పోలీస్ స్టేషన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని ఎప్పటికీ మర్చిపోలేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై కాంగ్రెస్ ప్రత్యేక నిఘా

## ఇందిరా భవన్‌లో బీఎల్ఏ, ఎస్ఎస్ఏలతో సమీక్ష సమావేశంలో పాల్గొన్న వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్

జనోదయ : వరంగల్



ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందిరా భవన్‌లో శనివారం ఏఐసీసీ తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ల ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్లు లతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ డీసీసీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ పాల్గొన్నారు. ప్రతి మూడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జరిగిన ఈ సమావేశాలకు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, అన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు, రాష్ట్ర స్థాయి ఎస్ఎస్ఏ కోఆర్డినేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సెక్యులర్ ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఓట్ల తొలగింపు ప్రక్రియ జరుగుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఒక రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఓట్లను తొలగించి, కేవలం 30 లక్షల కొత్త ఓట్లను మాత్రమే జాబితాలో చేర్చిన పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయానికి ఓటర్ల తొలగింపు ప్రక్రియ కూడా ఒక కారణమని ఆరోపించారు. బీజేపీ తదుపరి లక్ష్యంగా పంజాబ్, తెలంగాణ రాష్ట్రాలను ఎంచుకుందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై తెలంగాణ కాంగ్రెస్ ప్రత్యేక నిఘా ఉంచుతుందని తెలిపారు. ప్రతి వారం మంత్రులు తమ తమ నియోజకవర్గాల్లో పర్యటిస్తూ.. పార్టీ నిర్మాణం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఓటర్ల జాబితా పరిశీలన వంటి అంశాలపై దృష్టి సారిస్తారని ఆయన వెల్లడించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయి నుంచి పార్టీ వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, ఓటర్ల జాబితాలో అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టడం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఈ సమీక్ష సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్స్ హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

జనోదయ



# రైతు ముసుగులో కేసీఆర్ రాజకీయం

**సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, మే 30:** తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ నిలిపివేసినా, మోటార్లకు మీటర్లు పెట్టినా తాము ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఈ సవాల్‌కు బీఆర్ఎస్ సిద్ధమా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో చిట్ చాట్ చేస్తూ.. రాజకీయ లబ్ది కోసమే కేసీఆర్ రైతుల ముసుగులో లైఫ్ లైన్ కోసం ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా 'రైతు డిస్కం' ఏర్పాటు చేశామని, దీనివల్ల ప్రభుత్వానికి తక్కువ ధరకే విద్యుత్ కొనుగోలు చేసే వెసులుబాటుతో పాటు జవాబుదారీతనం పెరుగుతుందని స్పష్టం చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి వదిలేసిందే తప్ప ఒక్క గింజ కూడా కొనడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో వరి, జొన్న, మొక్కజొన్న పంటలను తమ ప్రభుత్వమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని, ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. తడిచిన ధాన్యానికి సైతం మద్దతు ధర కల్పిస్తున్నామని, సన్న వడ్లకు బోనస్ ఇస్తామని భరోసా ఇచ్చారు. బీజేపీ నేతలు ఢిల్లీకి బస్సులు వేసుకుని వెళ్తే, తాము వారి ఇళ్ల ముందుకే ట్రాక్టర్లతో వడ్లు తెచ్చి పోస్తామని ఆయన హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల వివాదాలపై ప్రధాని మోదీ మాటలు చెబుతున్నా, తుమ్మిడి హట్టి కోసం మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని



ఆక్షేపించారు. గ్లోబరీనా సంస్థ కేటీఆర్ బినామీదేనని ఆరోపించిన సీఎం, హరీష్ రావు ఇదులకుంట చెరువు అక్రమాలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు చేయడం బుద్ధిలేనితనమని, తన దృష్టి అంతా అభివృద్ధి పైనే ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.




**ముంబై:** కళ్లు చెదిరే మెరుపు ఇన్నింగ్స్‌లు.. ఔరా అనిపించిన అద్భుత ఫీల్డింగ్ విన్యాసాలు.. కట్టిపడేసిన బౌలర్ల మాయాజాలానికి నేటి (ఆదివారం)తో తెర పడనుంది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-19వ సీజన్‌లో ఆఖరి పోరుకు రంగం సిద్ధమైంది. నేడు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్ మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఇందుకు ప్రపంచంలోనే అతిపెద్ద నరేంద్ర మోదీ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఇరు జట్లు నాలుగోసారి తలపడబోతున్నాయి. లీగ్ దశలో తమ సొంతగడ్డపై చెరో జట్టు నెగ్గగా, తొలి క్వాలిఫయర్‌లో టైటాన్స్‌ను ఆర్‌సీబీ 92 పరుగులతో చిత్తుచేసి ఫైనల్ చేరింది. తాజాగా నాలుగు రోజుల విశ్రాంతి తర్వాత రజత్ పటీదార్ సారథ్యంలోని ఆర్‌సీబీ టైటిల్ సమరానికి సై అంటోంది. అటు టైటాన్స్ రెండో క్వాలిఫయర్‌లో రాజస్థాన్‌ను ఓడించి తుది పోరులో ప్రవేశించింది. 2025లో ఆర్‌సీబీ, 2022లో గుజరాత్ విజేతలుగా నిలిచాయి. గిల్ ఆధ్వర్యంలో టైటాన్స్‌కిదే తొలి ఫైనల్. ఈ సీజన్‌లో టైటాన్స్ ఇక్కడ ఏడు మ్యాచ్‌లాడగా, ఐదింట్లో నెగ్గింది. వరుసగా రెండో టైటిల్‌ను పట్టేసేందుకు ఆర్‌సీబీ పూర్తి ఆత్మవిశ్వాసంతో సిద్ధంగా ఉంది. ఈనేపథ్యంలో జట్టు మళ్లీ గుజరాత్‌తోనే తలపడబోతోంది. తొలి క్వాలిఫయర్‌లో ఆర్‌సీబీ బౌలర్లు టైటాన్స్ బ్యాటర్లను ఆటాడుకున్నారు. 255 స్కోరు ఛేదనలో ఆ జట్టు 150 పరుగులు చేసేందుకే అష్టకష్టాలు పడింది. పేసర్లు భువనేశ్వర్, హాజెల్‌వుడ్, డఫీ, రసిఖ్‌లతో పాటు స్పిన్నర్ క్రునాల్ చక్కటి ఫామ్‌లో ఉండడం సానుకూలాంశం. బ్యాటింగ్‌లో ప్రతీ బ్యాటర్ ఎదురుదాడే లక్ష్యంగా క్రీజులోకి దిగుతున్నారు. విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చకుండా ఓపెనర్‌గా వెంకటేశ్ అయ్యర్‌నే కొనసాగించవచ్చు. విరాట్ కోహ్లీ, దేవ్‌దత్, రజత్, క్రునాల్, డేవిడ్, జితేశ్‌లతో బ్యాటింగ్ విభాగం అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. కీలక పోరులో వీరిని టైటాన్స్ బౌలర్లు ఏమేరకు అడ్డుకుంటారో చూడాలి.బెంగళూరులో ఆడాల్సిన ఫైనల్ అహ్మదాబాద్‌కు తరలిరావడంతో, టైటిల్‌ఫైట్ చేరిన గుజరాత్‌కు అద్భుత అవకాశం లభించినట్టయ్యింది. తమకు అనుకూలంగా ఉండే సొంత వేదికపై రెండో టైటిల్‌ను ముద్దాడాలనే ఉత్సాహంతో టైటాన్స్ ఉంది. అయితే ముందు సరైన జట్టు కూర్పుతో బరిలోకి దిగాల్సి ఉంది. రాజస్థాన్‌పై స్పిన్నర్ సాయికిశోర్‌ను ఆడించినా ఒక్క ఓవర్ కూడా వేయించలేదు. గత సీజన్‌లో అతను 19 వికెట్లు తీసినా.. ఈసారి ఆడింది 3 మ్యాచ్‌లే.. వేసింది 4 ఓవర్లే. బౌలర్‌గా ఉపయోగించనప్పుడు అతడి స్థానంలో మరో బ్యాటర్‌ను తీసుకుంటే మేలు. కుమార్ కుషాగ్రను ఎంపిక చేస్తే ఫినిషర్‌గా ఉపయోగపడతాడు. ఇక మిగతా ఆటగాళ్లంతా జట్టులో కుదురుకున్నవారే. ఓపెనర్లు సాయి సుదర్శన్, గిల్ ఇప్పటికే చెరో 700ం రన్స్‌తో ఉండగా, బట్లర్ ఖాతాలోనూ 507 రన్స్ ఉన్నాయి. ఫైనల్లోనూ ఈ ముగ్గురు సత్తా అదరగొట్టాలి. పేసర్లు రబాడ, సిరాజ్ కొత్త బంతితో ఇబ్బందిపెడుతున్నారు. కానీ ఆర్‌సీబీ బ్యాటర్ల ఊచకోతను అడ్డుకోవాలంటే బౌలింగ్ విభాగం తగిన వ్యూహంతో బరిలోకి దిగాల్సిందే.

**తుది జట్లు**

**బెంగళూరు:** వెంకటేశ్ అయ్యర్, విరాట్, దేవ్‌దత్, రజత్ (కెప్టెన్), క్రునాల్, జితేశ్, డేవిడ్, భువనేశ్వర్, హాజెల్‌వుడ్, డఫీ, రసిఖ్.

**గుజరాత్:** గిల్ (కెప్టెన్), సాయి సుదర్శన్, బట్లర్, కుమార్ కుషాగ్ర, సుందర్, నిశాంత్, హోల్డర్, రషీద్, సిరాజ్, రబాడ, ప్రసిద్ధ్.

# బూతులు,బురదే

**రేవంత్ ఒక్కటంటే ఒక్క పనిచేసిండా.. ఎన్నికలకు ముందేమో డిక్లరేషన్ల వరద.. ఇప్పుడు నోరు తెరిస్తే బురద వచ్చేది బీఆర్ఎస్ సర్కారే : కేటీఆర్**



**హైదరాబాద్:** ఇందిరా పార్క్ వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో ఎస్సీ,ఎస్టీ డిక్లరేషన్‌లో 18 శాతం ఎస్సీలకు, 12 శాతం ఎస్టీలకు.. మొత్తం 30 శాతం ప్రభుత్వం కాంట్రాక్టుల్లో మీకే ఇస్తా అని చెప్పి గద్దెనెక్కిండు. కామారెడ్డిలో ప్రభుత్వ కాంట్రాక్టులలో బీసీలకు 42 శాతం వాటా అని చెప్పిండు. అంటే మొత్తం 72 శాతం వాటా.. ఈ రెండున్నరేళ్లలో రూపాయి టెండరు పిలిస్తే 72 పైసలు మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీలకే రావాలి. రేవంత్ రెడ్డి వచ్చాక 4 లక్షల కోట్లు అప్పు చేసిండు.. 4 లక్షల కోట్ల అప్పులో మొత్తం నాలుగు రూపాయలన్నా బీసీ,ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకు ఇచ్చినవా.. చెప్పే దమ్ముందా..? శ్వేత పత్రం ఇచ్చి దమ్ముందా..? అని ప్రశ్నించారు.తెల్లారి లేస్తే నోటికొచ్చిన సొల్లు వాగుడు.. నోటికొచ్చిన పనికిమాలిన మాటలు.. ఎన్నికలకు ముందేమో డిక్లరేషన్ల వరద.. ఇప్పుడు నోరు తెరిస్తే బురద.. అది తప్ప ఏం లేదు..బూతులు, బురద తప్ప ఒక్కటంటే ఒక్క పనిచేసిండా.. ఆలోచన చేయండన్నారు కేటీఆర్. కేసీఆర్ ఏమో అధికారులకు మీరు రొటీన్ ఫైళ్లు నా దగ్గరకు తీసుకురాకండి..చిన్న స్థాయిలో ఉండే చిన్న కాంట్రాక్టర్లను ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కాపాడండి.. పైకి తీసుకురండి అని ఆయన అప్పుడెప్పే నువ్వు పెద్ద పెద్ద మాటలు చెప్పి వచ్చి ఎవరికి ఇస్తున్నవ్ ఇయ్యాళ్ల కాంట్రాక్టులు...? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఇవాళ కాంట్రాక్టులు ఇస్తున్నది కేవలం ఇద్దరికే.. ఈ రాష్ట్రంలో కాంట్రాక్టులు వస్తున్నయంటే రేవంత్ రెడ్డి బావ మరిదికి .. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకు.. తప్ప ఇంకో వేరే మనిషికి వచ్చిందా..? వేరే ఏ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరుడికి వచ్చిందా.. మీరు ఆలోచన చేయాలన్నారు. మరి వాళ్లకే ఎందుకొస్తున్నయ్.. వాళ్లకు మాత్రమే కాదు. బీజేపీ వాళ్లకు కూడా వస్తున్నయ్. మన తెలంగాణలో కాంట్రాక్టులు బీజేపీ ఎంపీలకు కూడా వస్తున్నయ్. కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఒక్క బీజేపీ ఎంపీకి కాంట్రాక్టులు రాలేదు. కానీ ఇయ్యాళ రేవంత్ రెడ్డి వచ్చినంక యంగ్ ఇండియా స్కూల్స్ అని పెడితే ఒక్క ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీకి కాంట్రాక్టు రాలె . కానీ బీజేపీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డికి మాత్రం బ్రహ్మాండంగా వచ్చినయ్. అట్లాగే రేవంత్ రెడ్డి రోడ్లు టెండర్లు పిలిస్తే ఒక్క బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సోదరుడికి రాదు.. కానీ బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌కు మాత్రం రూ.13 00 కోట్ల కాంట్రాక్టు వస్తదని మండిపడ్డారు.ఢిల్లీకి డబ్బులు పంపకపోతే సీటు గాయబ్.. అందరికీ తెలుసు.. మీకు.. నాకు.. వాళ్ల మంత్రులకు కూడా తెలుసు. సరే గద్దెనెక్కిండు నూరు రోజుల్లో ఆరు గ్యారంటీలు అన్నడు. ప్రతీ సంవత్సరం ఒక్కో పేద కుటుంబానికి రెండున్నర లక్షలు రూపాయలిస్తా అన్నడు.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తా అన్నడు. మరి నూరు రోజులంటివి.. ఇన్ని కథలు చెప్తివి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ప్రశ్నించారు.రాష్ట్రంలో మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇవాళ ఏ ఒక్క ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎప్పుడు వస్తాయా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వదిలిపెట్ట కుండా ఎట్లా పోరాడారో, బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతా మన్నారు. బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రా లు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినక పోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా పోరాడుతా మన్నారు. 2028లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు, దాదాపు 50 వేల మంది బడుగు, బలహీన వర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని కేటీఆర్ అభయమిచ్చారు.




# అభిషేక్ బెనర్జీపై గుడ్లు,రాళ్లతో దాడి

**'చోర్ చోర్' నినాదాలు**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌కు చెందిన టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసా కాండ బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ స్థానిక బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. శనివారం సోనార్‌పూర్ ప్రాంతాన్ని అభిషేక్ బెనర్జీ సందర్శించారు. ఎన్నికల అనంతర హింసా కాండ బాధితుల కుటుంబాలను పరామర్శించేందుకు అక్కడకు చేరుకున్నారు.కాగా, స్థానికులైన బీజేపీ కార్యకర్తలు అభిషేక్ బెనర్జీని అడ్డుకున్నారు. ఆయనపై కోడిగుడ్లు, రాళ్లు విసిరారు. 'దొంగ దొంగ' అంటూ ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో అభిషేక్ బెనర్జీ హెల్మెట్ ధరించగా, సెక్యూరిటీ సిబ్బంది ఆయనకు రక్షణగా నిలిచారు.మరోవైపు తనపై జరిగిన దాడికి బీజేపీనే కారణమని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. 'ఇదంతా బీజేపీ ప్రాయోజితం. వాళ్లు ఏం చేశారో చూడండి. వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ ఇదేనా. నెల కూడా కాలేదు. పోలీసులు ఎక్కడా కనిపిం చడం లేదు' అని విమర్శించారు.తన పర్యటన గురించి ముందస్తు సమా చారం



అందించినప్పటికీ, తగినంత భద్రత కల్పించలేదని అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. 'పోలీసులు, భద్రతా బలగాలు ఇక్కడ భద్రత కల్పించేంత వరకు నేను ఇక్కడి నుంచి కదలబోను. వారు ఈ ఇంటిని ధ్వంసం చేయడా నికి ప్రయత్నిస్తున్నారు. అంతేకాక నన్ను చంపాలని చూస్తున్నారు' అని అన్నారు.

# ఒక్క పరీక్షను నిజాయితీగా నిర్వహించలేదు

**విద్యా వ్యవస్థను మోదీ నాశనం చేశారు : రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ:** ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'సమస్త విద్యా వ్యవస్థను' పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. శనివారం దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలో ఆలస్యం జరిగింది. రాహుల్ గాంధీ దీనిపై స్పందించారు. 'నీట్, సీబీఎస్ఈ, ఎస్ఎస్‌సీ, ఇప్పుడు క్యూట్. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థు లు. ఒక్క పరీక్ష కూడా నిజాయితీగా నిర్వహించలేదు' అని విమర్శించారు. 'విశ్వ గురు' అనే వాదనలను సవాల్ చేశారు. ప్రధాని మోదీ సమస్త విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. 'మీరు ఏ తరం భవిష్యత్తును నాశనం చేస్తు న్నారో, అదే తరం మిమ్మల్ని జవాబుదారీగా నిలబెడుతుంది' అని ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.కాగా, సీయూఈటీ ఆలస్యం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహ ణలో మరో వైఫల్యమని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నాయకురాలు, ఢిల్లీ మాజీ సీఎం అతిషి విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై తీవ్ర స్థాయి లో మండిపడ్డారు. మరోవైపు ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా దీనిపై స్పందిం చారు. అతిషి పోస్ట్‌ను ఆయన షేర్ చేశారు. 'దేశానికి విద్యావంతుడైన ప్రధాని కావాలి' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీ విశ్వవిద్యా లయం ప్రకారం ప్రధాని మోదీకి మాస్టర్స్ డిగ్రీ ఉన్నదని ఎద్దేవా చేశారు.అలాగే జాతీయ స్థాయి పరీక్షల్లో పదే పదే జరుగుతున్న సంస్థాగత వైఫల్యాలపై ప్రధాని మోదీ మౌనం వీడాలని ప్రతిపక్షాలు కోరాయి. విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

# ఈ టర్మ్‌లోనే పాలమూరు ప్రాజెక్టులన్నీ పూర్తి

**మహబూబ్‌నగర్, మే 30:** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు సహా ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ ఈ టర్మ్‌లోనే పూర్తి చేస్తా మని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో పెండింగ్ ప్రాజెక్టులను పరిశీలించేందుకు జూన్ 4, 5 తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారని చెప్పారు. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం ఎన్ని నిధులైనా మంజూరు చేసేందుకు సీఎం సిద్ధంగా ఉన్నారన్నారు. శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం అడవి అజిలాపూర్ గ్రామ సమీపంలో రూ. 32.05 కోట్లతో నిర్మించనున్న మినీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం



వైస్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి ఉత్తమ్ శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. అజిలాపూర్ ప్రాజెక్టు పూర్తయితే దేవరకద్ర మండలంలో 14 వందల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇచ్చిన ప్రాధాన్యం పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా తదితర ప్రాజెక్టులకు ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 90శాతం పూర్తి చేశామన్న బీఆర్ఎస్ నేతల మాటలు పచ్చి అబద్ధాలని మండిపడ్డారు. ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమం తర్వాత అజిలాపూర్ శివార్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రులు ఉత్తమ్, వాకిటి శ్రీహరి పరిశీలించారు.

